7

సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం | 13 | మార్చి | 2025



కిడ్నీల పట్ల శ్రద్ధ చూపాలి

మానవ శరీరంలో కిడ్నీలు అతి ముఖ్యమైనవి. కిడ్నీ సమస్యలపై అశ్రద్ధ చేస్తే మృత్యువాతపడే ప్రమాదం ఉంది.

- 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
గురు (సా)	శుక్ర (ఉ)
6.09	4.57

కూటమి దగా పాలనపై ఆగ్రహ జ్వాల

- విద్యార్థులు, యువత కోసం గొంతెత్తిన వైఎస్సార్‌సీపీ
- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ
- పోలీసులను అడ్డం పెట్టుకుని అడుగడుగునా ఆంక్షలు విధించిన ప్రభుత్వం
- అడ్డంకులను తిప్పికొట్టిన వైఎస్సార్‌సీపీ నేతలు, నిరుద్యోగులు

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం టౌన్:

కూటమి ప్రభుత్వ దగాకోరు పాలనపై యువతీయువకులు కదంతొక్కారు. విద్యార్థుల చదువులపై కూటమి అక్కసును ఎండగట్టారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా చదువును దూరం చేస్తోందని మండిపడ్డారు. జాబ్‌క్యాలెండర్, నిరుద్యోగభృతి హామీలు విస్మరించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా నినదించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ మోసపూరిత విధానాలను ఖండిస్తూ.. నిరుద్యోగులు, యువత, విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం 'యువత పోరు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి వందలాదిగా తరలివచ్చిన ఆ పార్టీ నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలసి పార్వతీపురం పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. కాంప్లెక్స్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. విద్యార్థులకు ఫీజు బకాయిలను తక్షణం విడుదల చేయాలని, నిరుద్యోగ యువతకు 'నిరుద్యోగ భృతి' అందించాలని.. లేని యెడల 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలని నినాదాలు చేశారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా, అడ్డంకులు సృష్టించినా ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరుబాట ఆపేది లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీ సీఎంలు పీడిక రాజన్నదొర, పాముల పుష్పశ్రీవాణి, మాజీ ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, విశ్వాసరాయి కళావతి స్పష్టం చేశారు. నేటి ప్రభుత్వ నిర్వాకంవల్ల పిల్లలను చదివించుకోలేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా తల్లికి వందనం, వసతిదీవెన, విద్యాదీవెన నిధులేవీ విడుదల చేయలేదని తెలిపారు. పేద, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేసేందుకు గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి.. రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలను తీసుకొస్తే.. వాటినీ నిర్వీర్యం చేసిందని.. వైద్య సీట్లు వద్దంటూ స్వయంగా ప్రభుత్వమే లేఖ రాసిందని గుర్తు చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారిణి హేమలతకు నాయకులు అందజేశారు.



పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సాగుతున్న యువత పోరు ర్యాలీ



ప్లకార్డుతో యువకుడు



యువత, నిరుద్యోగలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ డీఆర్వో హేమలతకు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యువతను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం



ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, అప్పటి వరకు నిరుద్యోగులకు నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి చెల్లిస్తామని కూటమి నేతలు హామీలిచ్చారు. యువత మద్దతుతో అధికారంలోకి వచ్చి నేడు వారినే మోసం చేస్తున్నారు. గత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో చదువుకు అండగా నిలిచేది. నేడు ఫీజురీయింబర్స్‌మెంట్ నిధుల కోసం పోరుబాట పట్టాల్సిన దుస్థితి నెలకుంది.

– శత్రుచర్ల పరీక్షిత్ రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం

యువగళానికి మంగళం



ఎన్నకల ముందు నారాలోకేశ్ యువగళం పేరుతో యువతకు హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోవడం మానేశారు. నిరుద్యోగ భృతిని ఎగ్గొట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వని పరిస్థితి నెలకొంది. నిరుద్యోగులను 2014లో మోసం చేశారు. మళ్లీ ఇప్పుడు మోసం చేస్తున్నారు.

– పీడిక రాజన్నదొర, మాజీ డిప్యూటీ సీఎం

యువతకు కుచ్చుటోపీ



కూటమి నేతలు అధికారంలోకి వస్తే అది చేస్తాం ఇది చేస్తామని చెప్పి చివరకు యువతకు కుచ్చుటోపీ పెట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు చదువుకష్టాలు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు, యువతకు న్యాయం చేసేంత వరకు పోరాడుతాం.

– పాముల పుష్పశ్రీవాణి, మాజీ డిప్యూటీ సీఎం

ఇబ్బందులకు గురవుతున్నాం..



గతంలో పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల చదువుకు సమయానికి విద్యా, వసతి దీవెన పథకాల కింద నిధులు జమచేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్కరూపాయి కుడా ఇవ్వలేదు. కళాశాలల ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థులను ఆదుకోవాలి.

– హేమలత, చిలకల్లి గ్రామం, బలిజిపేట మండలం

మోసపోయాం



కూటమి నేతల హామీలు నమ్మి మోసపోయాం. ఎన్నికల ముందు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇప్పటివరకు ఒక్క ఉద్యోగమూ లేదు.. నిరుద్యోగ భృతీ అందడంలేదు. యువతను ముంచేశారు.

– వంగపండు సాయి, పెదంకలాం, సీతానగరం మండలం

కళాశాలకు వెళ్లాలంటే భయమేస్తోంది



కళాశాల యాజమాన్యం ప్రతిరోజు ఫీజు డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం ఇప్పటివరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయలేదు. కళాశాలకు వెళ్లాలంటేనే భయంవేస్తోంది.

– మేఘన, పెదపెంకి, బలిజిపేట మండలం

ఓటేసి మోసపోయాం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు నెలకు రూ.3000 చొప్పున ఇస్తామన్న అబద్ధపు హామీని నమ్మి ఓట్లు వేసి మోసపోయాం. ఇంటికీ ఉద్యోగం అన్నారు.. ఒక్కటీ లేదు. యువతను మోసం చేస్తున్న ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుంది.

– శ్రీను, మూలభిన్నిధి గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం



కూటమి ప్రభుత్వ విద్యార్థి, యువత వ్యతిరేక పాలనను ఎండగడుతున్న విద్యార్థి

అడుగడుగునా ఆంక్షలు.. అడ్డగింతలు

నిరుద్యోగులు, యువత గళాన్ని వినిపించేందుకు.. వారి తరఫున ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన యువత పోరుకు కూటమి ప్రభుత్వం అడుగడుగునా ఆంక్షలు పెట్టింది. పోలీసులను ఉపయోగించి.. ఆందోళన కార్యక్రమాన్ని అడ్డగించేందుకు అన్ని దారులూ వెతికింది. తొలుత నిరసన కార్యక్రమానికి అనుమతులు లేవని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, నిరుద్యోగులు, యువత పట్టణంలో ర్యాలీ ప్రారంభించగానే.. అనుమతులు లేవంటూ అడ్డుకున్నారు. తాము శాంతియుతంగానే చేపడుతున్నామని వైఎస్సార్‌సీపీ నాయకులు చెప్పడంతో.. డ్రోన్ కెమెరా నిఘాతో ర్యాలీని కొంత దూరం వరకూ అనుమతించారు. కలెక్టరేట్‌కు వెళ్లనీయకుండా దాదాపు 200 మీటర్ల దూరంలో ప్రభుత్వ కళాశాల సమీపంలోనే బారికేడ్లు పెట్టి, రహదారిని బ్లాక్ చేశారు. వినతిపత్రం ఇచ్చే వరకూ తాము ఇక్కడి నుంచి వెళ్లేది లేదని యువత పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. పరిమిత సంఖ్యలో నాయకులే వెళ్లాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్ గేటు వద్ద కూడా కాసేపు అడ్డుకున్నారు. కొంతసేపు చర్చల తర్వాత ముఖ్య నాయకులను మాత్రమే లోపలికి వదిలారు.



యువత పోరును అడ్డుకుంటున్న పోలీసులను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇది రెడ్‌బుక్ రాజ్యాంగం



రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. పేద, బడుగు, అట్టడుగు వర్గాల వారు తమ హక్కులను కోల్పోతున్నారు. హక్కులపై పోరాటాలు చేసేవారిపై అక్రమ కేసులు పెడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో పేదలు చదువుకునే పరిస్థితి లేదు. యువతను మోసం చేయడం చంద్రబాబుకు ఆనవాయితీగా మారింది. నిరుద్యోగ భృతి ఇస్తానంటూ 2014లో మోసం చేశారు. ఇప్పుడూ అదే పరిస్థితి. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనపై యువత తిరగబడే రోజులు వచ్చాయి.

– అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే, పార్వతీపురం

చిత్తశుద్ధిలేని పాలన



కూటమి ప్రభుత్వానిది చిత్తశుద్ధిలేని పాలన. ఎన్నికల ముందు చెప్పేది ఒకటి.. అధికారంలోకి వచ్చిన తరువాత చేసేది మరొకటి. ఎన్నికల ముందు నారా లోకేశ్ యువగళం అంటూ హామీలవర్షం కురిపించారు. ఇప్పుడు మోసం చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిలేదు. ఉద్యోగాలూ లేవు. కనీసం ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు కూడా విడుదల చేయడంలేదు. విద్యార్థులకు న్యాయం జరిగేవరకు పోరాటం సాగిస్తాం.

– విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే, పాలకొండ

న్యూస్‌రీల్

మెరుగైన వైద్యసేవలందించాలి

పార్వతీపురం టౌన్: సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడేవారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. వైద్యారోగ్య శాఖ పనితీరుపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. గర్భిణుల నమోదు, వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. రక్తహీనత సమస్యను పరిష్కరించాలన్నారు. లక్ష్యం మేరకు ప్రసవ సేవలందిస్తున్న మొండెంఖల్లు పీహెచ్‌సీ సిబ్బందిని అభినందించారు. భద్రగిరి, సాలూరు, కురుపాం ఆస్పత్రుల్లో అదనపు భవనాల పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు టి.జగన్మోహనరావు, పద్మజ, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయ అధికారి పి.ఎల్.రఘుకుమార్, సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ, మలేరియా కన్సల్టెంట్ రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి గృహనిర్మాణాలకు అదనపు సహాయం

- జిల్లాకు రూ.73.09 కోట్ల కేటాయింపు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సాక్షి, పార్వతీపురం మన్యం: అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. పీఎంఏవై 1.0లో ఇల్లు మంజూరై, వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థిక సహాయం అందించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని వివరించారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వివిధ దశల్లో నిర్మాణాలు నిలిచిన బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు చెందిన 10,717 గృహాలను పూర్తి చేయనున్నామన్నారు. ఇందులో బీసీ లబ్ధిదారులు 4,109మంది, ఎస్సీ 1,169, ఎస్టీ 3,073, ఎస్టీ (పీవీటీజీ) లబ్ధిదారులు 2,366 మంది ఉన్నారని ఆయన వివరించారు. జిల్లాలోని లబ్ధిదారులకు అదనంగా రూ.73,09,75,000 మేర ప్రయోజనం కలగనుందని తెలిపారు. గృహ నిర్మాణం యూనిట్ విలువ రూ.1.80 లక్షలు కాగా.. ఎస్సీలు, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీటీజీ (ఆదివాసీ గిరిజనులకు) లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అదనంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ నిధులతో గృహనిర్మాణాలను 2025 ఏప్రిల్‌లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణం పూర్తి చేసుకునే దశలనుబట్టి అదనపు మొత్తం లబ్ధిదారుల ఖాతాకు నేరుగా జమ అవుతుందని వెల్లడించారు. లబ్ధిదారులు ఇల్లు పూర్తి చేసుకోవడానికి తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు.

విస్తృతంగా అవగాహన

అదనపు ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించామని కలెక్టర్ తెలిపారు. సర్వేకు వచ్చిన సచివాలయ, గృహ నిర్మాణ సంస్థ సిబ్బందికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సర్వే మార్చి 15 నుంచి 22వ తేదీ వరకు ఉంటుందని చెప్పారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి పి.ధర్మ చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, విశ్వాసరాయి కళావతి, పాముల పుష్పశ్రీవాణి, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ముందుగా దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను పరీక్షిత్‌రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీ 15వ వసంతంలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉందన్నారు. గత ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సుభిక్షమైన పాలన అందించిందన్నారు. మళ్లీ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కొండపల్లి బాలకృష్ణ, బొమ్మి రమేష్, బొంగు చిట్టిరాజు, పి.మురళీకృష్ణ, బోను గౌరీశ్వరి, కొండపల్లి రుక్మిణి, బలగ రేవవతమ్మ, మామిడి బాబ్జీ, ఎ.రవికుమార్, మజ్జి శోభారాణి, బలగ రమణమ్మ, జి.నాగమణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు జోగారావు, కళావతి, పుష్పశ్రీవాణి

క్లుప్తంగా

ఘనంగా వైభవ్ జ్యూయలర్స్ ప్రారంభం



వైభవ్ జ్యూయలర్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్

సాలూరు: పట్టణంలో వైభవ్ జ్యూయలరీ షోరూమ్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ మాధవ రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్‌లు హాజరై షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సాలూరు పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ జ్యూయలర్స్ షోరూమ్‌ను అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామమన్నారు. సంస్థ అసిస్టెంట్ వైస్‌ప్రెసిడెంట్ రఘునాథ్ మాట్లాడుతూ వినియోగదారులకు అద్భుత శ్రేణి షాపింగ్ అనుభవంతో పాటు విస్తృత శ్రేణిలో 916 హాల్‌మార్క్‌డ్ బంగారు ఆభరణాలు, సర్టిఫైడ్ డైమండ్స్ తదితర ఆభరణాలు అందించాలనే ఉద్దేశంతో ఈ షోరూమ్‌ను సాలూరులో ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో వైభవ్ సంస్థల సీఎండీ గ్రంధి భారత మల్లికా రత్నకుమారి, సీఈఓ గొంట్ల రాఖాల్ తదితరులు పాల్గొన్నారు.

డీసీహెచ్ఎస్‌లో ఖాళీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి (డీసీహెచ్ఎస్) పరిధిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ జీవీ రాజ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఈ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను 21వతేదీ సాయంత్రం 5 గంటల లోగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న డీసీహెచ్ఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని కోరారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పార్వతీపురం రూరల్: అమ్మాయిని మోసం చేసిన కేసులో పార్వతీపురం మండలం జమదాల గ్రామానికి చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి బుధవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన బాధితురాలు పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సరం ఉగాది 2025 పండగ పర్వదిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మారుమూల పల్లెలు, పట్టణాల్లో మట్టిలో మాణిక్యాల్లా దాగి ఉన్న కవులు, కళాకారుల, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, సమాజ సేవకులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారుల ప్రతిభను సేవలను గుర్తించి వారికి 'శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది- 2025 పురస్కారాన్ని' ఇచ్చి ఘనంగా సన్మానించి సత్కరించనున్నట్లు 'ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ' (సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ డైరెక్టర్ ఈఎస్ఎస్ నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజసేవ, పర్యావరణ పరిరక్షణ, వృద్ధులు, దివ్యాంగులు, విద్య, వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, కరాటే, ఆధ్యాత్మికం, వ్యవసాయం, ఉపాధి కల్పన, నాటకరంగం, టీవీ సినీరంగాల్లో సేవలందిస్తున్న వారు, ప్రతిభావంతులు, పురస్కారాల ఎంపిక కోసం వారి సేవలను, ప్రతిభను, గురించి తెలియచేసే వివరాలు పంపించాలని కోరారు. వివరాలకు ఫోన్ 9652347207నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల ప్రక్రియలో సలహాలు సూచనలకు ఆహ్వానం

పార్వతీపురంటౌన్: ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి, ఎన్నికల ప్రక్రియలో నూతన సంస్కరణలు తీసుకువచ్చే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి అవసరమైన సలహాలు సూచనలు ఆహ్వానిస్తోందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలో ఓటర్ల నమోదు నియమాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి వంటి అంశాలపై సలహాలు, సూచనలను ఈ నెల 31లోగా అందజేయాలని ఆయన సూచించారు. వచ్చిన సూచనలు, సలహాలపై భారత ఎన్నికల సంఘం ఏప్రిల్ 30న అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తుందని తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹98	₹166	176

కిడ్నీల పట్ల శ్రద్ధ చూపాలి

- నొప్పి మాత్రలు ఎక్కువగా వాడడం వల్ల కిడ్నీ సమస్యలు
- నెలకు 1200 నుంచి 1500 వరకు కేసుల నమోదు

విజయనగరం ఫోర్ట్: మానవ శరీరంలో కిడ్నీలు అతి ముఖ్యమైనవి. కిడ్నీ సమస్యలపై అశ్రద్ధ చేస్తే మృత్యువాతపడే ప్రమాదం ఉంది. కిడ్నీల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. కిడ్నీ సమస్యలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కిడ్నీ సమస్యలు తలెత్తిన వెంటనే చికిత్స చేయించుకుంటే సురక్షితంగా జీవించవచ్చు. ప్రతి10 మందిలో ఒకరు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్లు పలు అధ్యయనాల్లో తేలింది. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం. అధిక రక్తపోటు, మధుమేహం, స్థూలకాయం, అంటు వ్యాధులు, మాదక ద్రవ్యాల వినియోగం మూత్ర పిండాల వ్యాధికి ప్రధాన కారణం. నొప్పి మాత్రలు అధికంగా వాడడం, కిడ్నీలో రాళ్లు పెరగడం వల్ల కూడా కిడ్నీ సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది.

కిడ్నీ వ్యాధి వల్ల కలిగే సమస్యలు

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు గుండెపోటు, స్ట్రోక్, అధిక రక్తపోటు, బలహీనమైన ఎముకలు, గుండె వ్యాధి, కిడ్నీ వైఫల్యం(చివరి దశ మూత్ర పిండ వ్యాధి) సమస్యలు వస్తాయి. పింక్, డార్క్ మూత్రం(మూత్రంలో రక్తం) కష్టమైన బాధాకరమైన మూత్రవిసర్జన, అధిక మూత్ర విసర్జన, దాహం పెరగడం అలసట, బలహీనత, ఉబ్బిన చేతులు, ముఖం, పాదాలు, నురుగుమూత్రం కిడ్నీ వ్యాధి లక్షణాలు.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకున్న కిడ్నీవ్యాధిగ్రస్తులు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

ఆరోగ్యకరమైన జీవన శైలి నిర్వహించడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు. క్రమం తప్పకుండా వ్యాయమం చేయాలి. బరువును నియంత్రించుకుని, సమతుల్య ఆహారం తీసుకోవాలి. ధూమపానానికి దూరంగా ఉండాలి. కొలెస్ట్రాల్ స్థాయిలను పర్యవేక్షించుకోవడం, వార్షిక శారీరక ఆరోగ్య పరీక్షలు చేయంచుకోవాలి. అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నవారు వాటిని అదుపులో ఉంచుకోవాలి. మూత్ర పిండ వ్యాధిని గుర్తించడానికి స్క్రీనింగ్ చేయించుకోవాలి.

నెలకు 1200 నుంచి 1500 వరకు రోగుల నమోదు

జిల్లాలో కిడ్నీ సంబంధిత వ్యాధులతో నెలకు వందలాది మంది ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్నారు. నెలకు 1200 నుంచి 1500 మంది వరకు రోగులు ఆస్పత్రుల్లో నమోదవుతున్నారు. కిడ్నీలు పాడై డయాలసిస్ చేయించుకున్న రోగులు 400 నుంచి 500 మంది వరకు ఉన్నారు. కిడ్నీ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల కిడ్నీ వ్యాధి గ్రస్తుల సంఖ్య బాగా పెరుగుతోంది. వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించలేక పోవడం వల్ల వారు డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితికి వస్తున్నారు.



కిడ్నీ సమస్యతో వచ్చిన వ్యక్తిని పరీక్షిస్తున్న వైద్యుడు

బీపీ, సుగర్ అదుపులో ఉంచుకోవాలి



కిడ్నీ సమస్యలను ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధితీవ్రతను తగ్గించవచ్చు. బీపీ, సుగర్ వంటి వ్యాధులను అదుపులో ఉంచుకోవాలి. శారీరక శ్రమ ఉండేందుకు ప్రతిరోజూ వ్యాయమం చేయాలి. సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి. శరీరంలో కొవ్వు పరిస్థితిని ఆరోగ్య పరీక్షల ద్వారా తెలుసుకోవాలి. కిడ్నీలో రాళ్లు పెరగకుండా చూసుకోవాలి. నొప్పి మాత్రలు అధికంగా వాడడం వల్ల కూడా కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

డాక్టర్ రెడ్డి శివకుమార్, నెఫ్రాలజిస్టు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

ఆశ్రమ పాఠశాల ఆకస్మికంగా తనిఖీ

- పది విద్యార్థుల చదువుపై ఆరా

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలంలోని రావికోన సమీపంలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి సబ్జెక్టుల సిలబస్ పూర్తి జరిగిన తీరుపై ఆరా తీశారు. అన్ని సబ్జెక్టులు చక్కగా రివిజన్ చేసి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధం కావాలని విద్యార్థులకు పీఓ సూచించారు. పరీక్షలను నిర్ణీత సమయంలో జాగ్రత్తగా రాయలని విద్యార్థులకు చెప్పారు. ఆశ్రమ పాఠశాలలో మెనూ ప్రకారం సక్రమంగా భోజనం పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు.



ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

పోలమాంబ ఏడవ జాతర ఆదాయం రూ. 3,07,650

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఏడవ వారం జాతర ఆదాయాన్ని ఈవో వీవీ.సూర్యనారాయణ సమక్షంలో బుధవారం లెక్కించారు. ఏడవ జాతరలో మొత్తం రూ.3,07,650 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవాదాయ శాఖ సిబ్బంది

బాసంగి ముంపులో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి, బాసంగి గదబవలస ముంపులో బుధవారం మధ్యాహ్నం ఏనుగులు జలకాలాడాయి. పగటి పూట ముంపులో ఉంటూ సాయంత్రం గదబవలస వద్ద ఉన్న వరిచేలను ధ్వంసం చేస్తున్నాయి. వరిపంట పూర్తిగా నాశనం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వారం రోజుల నుంచే చుట్టుపక్కల గ్రామాలైన చింతలబెలగాం, రామినాయుడువలస, గవరమ్మపేట, సుభద్రమ్మవలస, పెదమేరంగి పంట పొలాల్లో ఉంటూ పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతుల బాధ వర్ణనాతీతంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏనుగులను తరలించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



బాసంగి ముంపులో ఉన్న ఏనుగులు

ఉత్సాహంగా గిరిజన చిత్రలేఖనం పోటీలు



పార్వతీపురం ఐటీడీఏకు చెందిన 9వ తరగతి విద్యార్థి గీసిన బాలచందర్ ఊహల్లో గిరిజన మహిళ చిత్రం

కొమ్మాది: గిరిజన స్వాభిమాన ఉత్సవాలు-2025లో భాగంగా బుధవారం విశాఖ రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్(టీసీఆర్‌టీఎం) ఆధ్వర్యంలో గాయత్రి కళాశాల ప్రాంగణంలో గిరిజన విద్యార్థులు, కళాకారులకు నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ముందుగా ఈ కార్యక్రమాన్ని టీసీఆర్‌టీఎం ఈడీ డా.రాణీమందా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. ఈ పోటీల్లో 8 ఐటీడీఏల పరిధిలోని 17 జిల్లాల నుంచి 250 మంది పాల్గొన్నారని వెల్లడించారు. ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆచార్యులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని చెప్పారు. నెల్లూరు ఐటీడీఏకు చెందిన సీహెచ్ మణి విజేతగా నిలవగా, పాడేరు ఐటీడీఏకు చెందిన బి.నందిని, ఆర్.రాజేష్‌లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అనంతరం విజేతలకు ఈడీ బహుమతులు ప్రదానం చేశారు. గాయత్రి కళాశాల ప్రొఫెసర్ పి.వి.శర్మ, టీసీఆర్‌టీఎం సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీలో డ్రోన్లపై వర్క్‌షాప్ ప్రారంభం



జ్యోతిని వెలిగించి ప్రారంభిస్తున్న సెంచూరియన్ యూనివర్శిటీ డీన్ డాక్టర్ జే.అనీల్‌కుమార్, గిరిజన యూనివర్శిటీ ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు

విజయనగరం అర్బన్: డ్రోన్ల వినియోగంతో వ్యవసాయం రంగాన్ని లాభసాటిగా మెరుగుపరచవచ్చని సెంచూరియన్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ జె.అనిల్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. సెంచూరియన్ యూనివర్సిటీతో సంయుక్త నిర్వహణలో స్థానిక కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో 'వింగ్స్ ఆఫ్ ఇన్నోవేషన్: ఎంపవరింగ్ స్కిల్స్ త్రూ డ్రోన్ టెక్నాలజీ' అనే అంశంపై రెండురోజుల పాటు నిర్వహించే వర్క్‌షాప్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయరంగంలో డ్రోన్లను ఉపయోగించి వ్యవసాయం చేయగలిగితే తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల సాయంతో నీటి వనరుల లభ్యత, పురుగు మందుల పిచికారీ, ఎరువులు వేయడం తదితర పనులు తక్కువ ఖర్చుతో చేయడానికి అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని సంస్థలకు డ్రోన్లను రాయితీలపై అందజేస్తోందని తెలిపారు. పర్లాకిమిడి సెంచూరియన్ యూనివర్సిటీ నుంచి గౌరవ అతిథిగా వచ్చిన అసోసియేట్ డీన్ డాక్టర్ కొర్ల హర్షవర్ధన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో డ్రోన్స్ వినియోగంపై వివరించారు. కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు మాట్లాడుతూ రక్షణ, వ్యవసాయం, ఇతర రంగాల్లో డ్రోన్ల అవసరం పెరిగిందన్నారు. కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ సోనియా పాణిగ్రాహి, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.లత, డాక్టర్ ప్రేమ ఛటర్జీ, డాక్టర్ ఎన్‌వీఎస్‌సూర్యనారాయణ, డాక్టర్ ఎంజీనాయుడు, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, డాక్టర్ కె.దివ్య, డాక్టర్ ఎం.ప్రసాద్, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్‌లో రాణించిన లలిత

- కాంస్య పతకం కైవసం

విజయనగరం: న్యూ ఢిల్లీ వేదికగా ప్రారంభమైన ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ 2025 పోటీల్లో 1500 మీటర్ల పరుగు పందెంలో ఉమ్మడి విజయనగరం జిల్లా క్రీడాకారిణి కిల్లక లలిత కాంస్య పతకం గెలుచుకుంది. ఆమె గెలుపు జిల్లాకు గర్వకారణమని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 20 దేశాలకు చెందిన పారా క్రీడాకారులు పాల్గొన్నారని, గట్టి పోటీలో సైతం అసామాన్య ప్రతిభ కనబరచిన లలిత తానేంటో నిరూపించడమే కాకుండా అంతర్జాతీయస్థాయిలో విజయనగరం పేరు మారుమోగేలా చేసిందని ప్రశంసించారు. ఈ పతకం మన రాష్ట్ర క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, ఇతర విభాగాల్లోనూ ఆమె పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించిన లలితకు కలెక్టర్ డాక్టర్. బీఆర్.అంబేడ్కర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావులు అభినందనలు తెలియజేశారని చెప్పారు.



లలిత

55 సెకెన్లలో హనుమాన్ చాలీసా పఠనం

- ప్రపంచ రికార్డు సాధించిన జయ పవన్‌కల్యాణ్

విజయనగరం టౌన్: హనుమాన్ చాలీసా పఠించడంలో విజయనగరానికి చెందిన జయ పవన్ కల్యాణ్ ప్రపంచ రికార్డు సృష్టించారు. 55 సెకెన్లలో హనుమాన్ చాలీసాను పూర్తిగా పఠించినందుకు గాను ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. ఈ మధ్య జరిగిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పోటీల్లో ఆయన పాల్గొని, హనుమాన్ చాలీసాను అతి తక్కువ నిడివిలో పూర్తిగా పఠించిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించాడు. గతంలో బీహార్‌కు చెందిన అబ్బాయి 59 సెకెన్లలో హనుమాన్ చాలీసా పఠించగా ప్రస్తుతం ఆ రికార్డును తిరగరాసి 55 సెకెన్లలో హనుమాన్ చాలీసాను పఠించడం గొప్ప విషయం. విజయనగరం నగర పాలక సంస్థలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తాతబాబు కుమారుడు జయపవన్ కల్యాణ్. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడంతో జయ పవన్ కల్యాణ్‌కు అందరూ అభినందనలు తెలియజేస్తున్నారు. ఆంధ్ర యూనివర్సిటీలో ఎంటెక్ పూర్తి చేసిన జయ పవన్ కల్యాణ్ అత్యంత సృజనను కనపరిచి ఈ రికార్డును సొంతం చేసుకోవడం విశేషం. ఈ మేరకు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ వారు యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి అనేక సామాజిక మాధ్యమాల్లో జయ పవన్ కల్యాణ్ సాధించిన రికార్డును నిక్షిప్తం చేశారు. దీంతో ఈ విషయం ప్రస్తుతం వైరల్ అవుతోంది.



జయ పవన్ కల్యాణ్

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

- గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులు
- బొడ్డవర చెక్‌పోస్ట్ వద్ద కారు టైరులో గంజాయి పట్టివేత

విజయనగరం క్రైమ్: గంజాయిని అక్రమంగా రవాణా చేసినా, అమ్మినా, కొనుగోలు చేసినా ఎన్డీపీఎస్ చట్టం ద్వారా కేసు నమోదు చేస్తామని ఎస్పీ వకుల్ జిందల్ మరోసారి స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఐదుగురు నిందితుల ముఠాను ప్రవేశపెట్టారు. బొడ్డవర చెక్‌పోస్ట్ వద్ద వెహికల్స్ తనిఖీ చేస్తుండగా కారు వెనుక భాగంలో స్టెపినీ టైరులో గంజాయిని తరలిస్తున్న ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఈ సందర్భంగా కేసు వివరాలను ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు. చెక్ పోస్ట్ వద్ద ఎస్.కోట ఎస్సై ఎల్.చంద్రశేఖర్ వాహనాలు తనిఖీ చేస్తుండగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన కారు వెనక భాగంలో తనిఖీ చేస్తున్న సిబ్బందికి అనుమానం వచ్చి కారు స్టెపినీని ఓపెన్ చేయగా డెబ్బై కిలోల గంజాయి 56 ప్యాకెట్లలో లభ్యమైందన్నారు. వెంటనే దానిని రవాణా చేస్తున్న ఒడిశాలోని మల్కన్‌గిరికి చెందిన రంజిత్ బిశ్వాస్, నిఖిల్ తపాయి, బిశ్వాస్ మహీధర్, యూపీకి చెందిన షా ఆలం, బెంగళూరుకు చెందిన షేక్ ఇజాజ్ అహ్మద్‌లను ఎన్డీపీఎస్ చట్టం కింద అరెస్ట్ చేశామని ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి ఒక కారు, నాలుగు మొబైల్‌ఫోన్స్, రూ.20 వేలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గంజాయిని అక్రమ రవాణాపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి పోలీస్ శాఖ వెనకాడబోదని ఈ సందర్భంగా ఎస్పీ స్పష్టం చేశారు.



గంజాయి తరలిస్తున్న నిందితులను విలేకరుల ముందు ప్రవేశ పెట్టిన ఎస్పీ. చిత్రంలో డీఎస్పీ శ్రీనివాస్, ఎస్.కోట సీఐ నారాయణ

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.88వేల620, 9స్మార్ట్‌ఫోన్‌లు, ఒక ల్యాప్‌టాప్,
- మూడు గోల్డ్ కలర్ వాచ్‌లు స్వాధీనం

గజపతినగరం: గజపతినగరం జాతీయ రహదారి పక్కన, మెంటాడ జంక్షన్ రోడ్డు ఇరువైపులా ఉన్న మొత్తం 8షాపుల్లో ఇటీవల చోరీకి పాల్పడిన దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం గజపతినగరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గజపతినగరంలో దొంగతనాలకు పాల్పడిన వారు అంతర్ రాష్ట్ర గజదొంగలన్నారు. కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో వరుసగా వీరు దొంగతనాలకు పాల్పడుతూ వస్తున్నారని రాత్రి పూట ఎవరు లేని సమయంలో షట్టర్లు పగులగొట్టి నగదు, సొత్తు లూటీ చేయడమే వారి పని అని తెలిపారు. సీసీటీవీ ఫుటేజీ ద్వారా నిందితులను గుర్తించి నలుగురిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామని చెప్పారు. అరెస్ట్ అయిన వారిని షేక్ బాషా, రావుల రమణ, శ్రీనునాయక్, గుల్లిపల్లి కిరణ్‌కుమార్‌లుగా గుర్తించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు వెంకటేష్ శివగౌడ, రంగురవిల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి రూ.88వేల620నగదు, 9స్మార్ట్‌ఫోన్‌లు,ఒక ల్యాప్‌టాప్, మూడు గోల్డ్ కలర్ వాచ్‌లను రికవరి చేసినట్లు డీఎస్పీ వివరించారు. కార్యక్రమంలో సీఐ, ఎస్సైలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి (వెనుక ముసుగులో నిందితులు)

నేడు కవయిత్రి మొల్లమాంబ జయంతి

పార్వతీపురం: కవయిత్రి మొల్లమాంబ జయంతిని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

మడ్డువలస కాలువలో బాలిక మృతదేహం లభ్యం

వంగర: మండల పరిధి మడ్డువలస కుడి ప్రధాన కాలువలో గల్లంతైన కళింగ సైనీ మృతదేహం బుధవారం లభ్యమైంది. ఈ నెల 11వ తేదీన ఇద్దరు బిడ్డలతో సహా తల్లి కళింగ శ్రావణి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు దిగువ భాగం కుడి ప్రధాన కాలువలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ సంఘటనలో మహిళ కళింగ శ్రావణి, బాలుడు కళింగ సిద్దులను సంగాంకు చెందిన జన్ని జగన్‌మోహన్(చిన్న) సాహసించి కాపాడి ఒడ్డుకు చేర్చగా బాలిక కళింగ సైనీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గజ ఈతగాళ్లు, పలువురు మత్స్యకారులు గాలించినా ఫలితం లేకపోయింది. చీకటి పడడంతో బంధువులంతా అక్కడే పడిగాపులు కాశారు. బుధవారం ఉదయం ఘటన జరిగిన ప్రదేశానికి కొద్ది దూరంలో బాలిక సైనీ మృతదేహం ఉన్నట్లు బంధువులు గుర్తించారు. బాలిక మేనమామ గుంట చంటి, కుటుంబసభ్యులు కాలువ నుంచి మృతదేహాన్ని తీసే ప్రయత్నంలో వారు రోదించిన తీరు అందరినీ కలిచివేసింది. మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చిన అనంతరం పోలీసులు రాజాం సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కింజంగి గ్రామానికి తరలించగా మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన వారంతా చలించిపోయారు. బాలిక తండ్రి కళింగ సుధాకర్‌ను బాలిక మృతదేహం వద్దకు తీసుకువచ్చినా ఆయన మానసిక స్థితి బాగోలేక బిత్తర చూపులు చూశాడు.





బాలిక మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చుతున్న మేన మామ గుంట చంటి, (ఇన్‌సెట్లో) కళింగ సైనీ(ఫైల్)

బ్యాంక్‌లో చోరీకి విఫల యత్నం

సీతానగరం: మండల కేంద్రంలోని కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. మండలకేంద్రంలోని మార్కెట్‌లో ఉన్న కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్‌లో మంగళవారం సాయంత్రం విధులు పూర్తిచేసుకుని సిబ్బంది సక్రమంగా తాళాలు వేసుకుని వెళ్లారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు యథావిధిగా విధులకు వచ్చిన సిబ్బంది తాళాలు తీయడానికి చూడగా ప్రధాన గుమ్మానికి ఉన్న తాళం విరగ్గొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఇన్‌చార్జి ఎస్సై వై.సింహాచలం, పార్వతీపురం రూరల్ సీఐ ఎస్.గోవిందరావు జిల్లా పోలీస్ క్లూస్ టీమ్ ఎస్సై ఎస్.తేజస్వరూప్ సిబ్బందితో వచ్చిన చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలించారు. బ్యాంక్ అధికారులతో కలిసి క్లూస్‌టీమ్ సోదాలు చేయగా లాకర్ తాళాలు, మెయిన్ బ్యాంక్ తాళాలు సక్రమంగా ఉన్నట్లు గుర్తించి ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై సీఐ ఎస్.గోవిందరావు మాట్లాడుతూ బ్యాంక్ ప్రధాన తలుపు తాళం విరగ్గొట్టడంతో బ్యాంక్ బీఎం సూర్యనారాయణ ఫిర్యాదు చేశారన్నారు. చోరీకి పాల్పడిన వారి ఆచూకీ కోసం బ్యాంక్‌లో అమర్చిన సీసీ పుటేజీలను పరిశీలించి నేరానికి పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు.



ఫింగర్‌ప్రింట్స్ తీస్తున్న క్లూస్ టీమ్ ఎస్సై తేజ స్వరూప్

మత్స్య సంపద అభివృద్ధికి చర్యలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో మత్స్య సంపద అభివృద్ధి చెందడానికి పలు చర్యలు తీసుకున్నట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య అన్నారు. మత్స్య సంపద వృద్ధి చేయాలన్న సంకల్పంతో చేపల పెంపకంలో ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీస్, సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్స్, వందన వికాస్ కేంద్రాలతో భాగస్వామ్యం చేసి మత్స్య ఉత్పత్తి వద్ధి చేయడానికి క్యాప్టింగ్ ఫిష్ సీడ్ రేరింగ్ యూనిట్స్' (చెరువులలో చెరువు) నిర్మించుకునే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్ఆర్ఈజీఎస్, నీటిపారుదల శాఖ, డీఆర్‌డీఏ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల పెంపకంలో మత్స్యకారులను భాగస్వామ్యం చేస్తే మేలైన, నాణ్యమైన చేపపిల్లలు అధిక ఉత్పత్తి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మత్స్యకారుల్లో శాస్త్రీయ, సాంకేతిక అవగాహన పెరిగి వారి జీవన స్థితిగతులు పెంపొందిస్తే జీవనోపాధి మరింత మెరుగుపడుతుందన్నారు. జాతీయ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫాం (ఎన్ఎఫ్డిపి), శ్రమ్ పోర్టల్స్‌లో ఫిషర్స్, ఫిష్ వెండర్స్, ఎంటర్ ప్రెన్యూర్స్, టీడర్స్, ఫిష్ వర్కర్స్, మత్స్యకారుల కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు తప్పనిసరిగా వారి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. నమోదు చేయసుకోవడం వల్ల వారికి జీవిత బీమా, బ్యాంక్ రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు డి.గోపీకృష్ణ, శ్రీదేవి, జిల్లా మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు, ఎన్‌జీఓ సభ్యులు, నీటిపారుదల శాఖ జేఈ, ఏఈలు, ఎన్ఆర్ఈజీఎస్, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్స్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, డైరెక్టర్స్, ప్రెసిడెంట్లు, గ్రామ మత్స్య సహాయకులు పాల్గొన్నారు.